# అసలు సగం

సాధారణ వ్యవహారిక సత్యాలకీ, సామాజిక వాస్తవాలకీ- సాహిత్య గౌరవం, తాత్త్వికౌన్నత్యం ఇవ్వగలిగిన కళాత్మక కలం- విహారి గారిది. ఈ నిజానికి దృష్టాంతం ఈ కథ.

- ఆర్. ఎస్. చంద్రశేఖర్ ( బెంగళూరు )

"అంతా అన్యాయం, దురన్యాయం. పైగా నేను అట్టా అనకూడదుట. దొంగముండా కొడుకులు... అసలీ లెక్చరర్లకి బుద్ధి లేదు."

గుర్నాథం ఉలిక్కిపడ్డాడు. మాటల్లో బయటి సెగ- లోపలి అగ్గిని తెలుపుతోంది. దినపత్రికని పక్కన పడేసి, తక్కున మురళి వైపు చూశాడు.

అన్నం తింటున్నాడు. రగులుతున్న అగ్నిపర్వతంలా ఉన్నాడు... 'ఎంతమాట అన్నాడు? అసలీ లెక్చరర్లకి బుద్ధి లేదు!'

వివరం కోసం ఆగమన్నది వివేకం. వినసాగేడు.

అమ్మమ్మ శాంత- గుర్నాథం భార్య- మనవడిని వింటున్నది.

"అవునమ్మమ్మా... చివర్లో ఇంకా అర్ధగంట టైముంది. అప్పుడు మా రూమ్‌లో వున్న ఇన్‌విజిలేటరేమో క్వొశ్చన్ పేపర్‌ని గాలిలోకి ఆడిస్తూ... 'మీకెవరికైనా ఏమైనా అనుమానాలుంటే త్వరత్వరగా అడగండి..' అన్నాడు. పిల్లలందరూ ప్రశ్న తర్వాత ప్రశ్న అడుగుతుంటే ఆయన జవాబులు చెప్పేశాడు. వాళ్ళంతా రాసేసుకున్నారు..."

చెప్పటం ఆపి అమ్మమ్మ కళ్ళలోకి చూశాడు- 'వింటున్నావా?' అన్నట్టు.

కంచంలో పచ్చడి వేస్తూ, నిమ్మళంగా "చెప్పు..." అందామె.

"నాకేమో ఏడుపొచ్చింది. కోపమొచ్చింది. తక్కున లేచి 'ఇది అన్యాయం సార్. అన్ని ప్రశ్నలకూ మీరే ఇట్టా ఆన్సరిస్తే మేమంతా కష్టపడి చదవటమెందుకూ? మీరు చేస్తున్నది తప్పు' అన్నాను."

తలెత్తి అమ్మమ్మ వైపు చూసి, చూపులు తిప్పి నావైపూ చూశాడు.

శాంత అన్నంలో మజ్జిగ పోసింది. వాతావరణం ఉక్కగా ఉందన్న భావంతో చీరకొంగు సర్దుకొని మొహం తుడుచుకుని "ఊఁ..." అని దీర్ఘం తీసింది.

మురళి కొనసాగించాడు-

"ఆయన నా దగ్గరగా వచ్చి నవ్వేశాడు. 'నువ్వు రేంక్ స్టూడెంట్‌వి మురళీ... రేపు నీ ఫోటో పేపర్లో కూడా పడుతుంది. కానీ వీళ్ళంతా మఠ్ఠా సరుకు. కనీసం పాస్ కావాలి కదా... అందుకూ నేను సాయం చేయడం!' అన్నాడు నా భుజం తట్టి.

'డోన్ట్ వర్రీ... పరీక్ష హాల్లో ఇట్టా మాట్లాడకూడదు. ఉద్రేకపడకూడదు...' అంటూ ఫోజు కొట్టాడు. పెద్ద నీతిబోధ... పరీక్ష హాలుట! వెధవలు... ఇంటర్మీడియట్టూ... పబ్లిక్ పరీక్షలూ... అంతా ఫార్స్... పెద్ద నాటకం!"

ప్రతి మాటనీ నొక్కి నొక్కి అంటూ- లేచి చెయ్యి కడుక్కుని విసురుగా కదిలి తాతవైపు ఒక కసి చూపు విసిరి వెళ్లిపోయాడు మురళి.

మనవడి వైపు మురిపెంగా చూసి, 'ఏం చెప్తారో చెప్పండి!' అన్నట్లు చురుగ్గా భర్త వైపు చూసింది శాంత.

గుర్నాధంకి నిజంగా కొరడా ఝుళిపించినట్లయింది. ముప్పై ఎనిమిదేళ్లు ఆయన చేసింది ఉపాధ్యాయగిరీనే మరి. ఆలోచనలో పడ్డాడు-

'ఆ రోజుల్లో పబ్లిక్ పరీక్షలంటే ఎంత స్ట్రిక్ట్‌గా జరిగేవి! స్కూళ్ల ఇన్‌స్పెక్టర్లు, డి.ఇ.ఓ.లు, రాజధాని నుంచి ప్రత్యేక అధికారులు చెకింగ్‌కి వచ్చేవాళ్ళు. వెంపటి పురుషోత్తంగారి లాంటి హెడ్‌మాస్టర్లు ఎందరో పిల్లల్ని కాపీ కొడ్తున్నందుకు డిబార్ చేయించేవాళ్ళు. అవీ ఆ రోజులు! ఇవాళ? ఇదీ ఈ తీరు! మనుషుల బుద్ధులు మారుతున్నై. కానీ, సంభవిస్తున్న మార్పు మనిషిని ఏ దిక్కుకు నడుపుతోంది?'

ఆలోచనల్లోనే దినపత్రిక పుటల్ని తిరగేశాడు. 'విద్యా విధానంలో మౌలికమైన మార్పులు' ఉద్ఘాటన. మంత్రిగారు మారేరు! 'టీచర్లే లేని స్కూల్స్‌లో పాఠాలేం జరుగుతాయ్?', 'కాపీ కొట్టడం మా హక్కు- అని విద్యార్థుల ఆందోళన!', 'హాస్టల్ అన్నంలో పురుగులు- విద్యార్థుల ఆందోళన, ధర్నా!'- పేపరంతా ఇలాంటి శీర్షికలు, మేటర్లో న్యూస్‌కంటే ఆ పత్రికా విలేకరుల వ్యాసే ఎక్కువగా ఉన్నై. ఒకడు వీరంగం వేస్తుంటే

మరొకడు కొరడాతో చితకబాదుతున్నట్టు ఉంది పరిస్థితి. పొలిటికల్ సైన్స్‌లోనే డాక్టరేట్ తీసుకున్న గుర్నాధంకి ఈ కథనాలూ, కథలూ అవగతం కావడం లేదు. జరుగుతున్న పరిణామాలు ఉన్న మతి పోగొట్టేవిగా ఉన్నై.

"వాడితో మాట్లాడండి..." అంటూ వచ్చి కూర్చుంది శాంత.

గుర్నాధం ప్రస్తుతంలోకొచ్చాడు. మురళి కళ్ళముందు మెదిలాడు. గుర్నాధం, శాంతల ఏకైక కూతురు కుసుమ ఒక్కగానొక్క కొడుకు మురళి. అల్లుడు సుందరం బ్యాంక్ ఆఫీసర్. కుసుమ ఏదో కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్- ఢిల్లీలోనే. చిన్నప్పట్నుంచీ తాత, అమ్మమ్మల దగ్గరే పెరిగాడు మురళి.

"ఏం చదువులో, ఏమో... పిల్లల్ని వేపుకు తింటున్నాయ్!" -శాంత.

"మాట్లాడాలి. కానీ, రాత్రికి మాట్లాడతాను" అన్నాడు గుర్నాధం. బయట చల్లగా వుంది. లోపలే వేడిగా, జ్వరం వచ్చినట్లుంది!

●

రాత్రి పెద్దవాళ్ళ ఫలహారం, మురళి భోజనం అయినై.

హాల్లో కూర్చుని వార్తల ఛానల్ చూస్తున్నాడు గుర్నాధం. శాంత వచ్చింది. చీరె చెంగుని సర్దుకుని గోడవారగా నేల మీద కూర్చుంది.

"ఆ గదిలో మురళి బోనులో సింహంలా తిరుగుతున్నాడు. మధ్యాహ్నం నుంచీ తనలో తాను కుములుతూనే ఉన్నాడు. రేపటి పరీక్షకు చదువుతున్నట్లు లేదు" అన్నది.

"రేపు పరీక్ష లేదు లేవే!" అంటూ తానూ లేచి మురళి గదివైపు కదిలాడు గుర్నాధం.

అలికిడికి తలతిప్పి చూశాడు మురళి.

టేబుల్ ముందు కూచుని వున్నాడతను. టేబుల్ మీదంతా పుస్తకాలు, కాగితాల దొంతరలూ.

"చెప్పు తాతయ్యా..." అన్నాడు. మాట చాలా సౌమ్యంగా వుంది.

"నెక్ట్స్ పరీక్ష ఏమిటి?" కూర్చుంటూ అడిగాడు.

"ఫిజిక్స్!"

ఆ తర్వాత కొన్ని క్షణాలు మౌన సముద్రంలో మునిగాయి. తను అనుభవమూ, పరీక్షలూ, మానసికమైన ఒత్తిడి, ఫలితాల గురించిన ఆందోళన, పరీక్ష హాల్లో పరిస్థితులూ, పరిసరాలూ, ఇతరుల ప్రవర్తనా- ఇలా చాలా విషయాల మీద తన అభిప్రాయాలు వివరిస్తూ, సలహాలూ, సూచనలూ కూడా ఎంతో మెళకువతో, చాకచక్యంతో అందించాడు గుర్నాధం. అన్నీ విని తాతయ్య వైపు అదోలా చూశాడు మురళి.

ఆ చూపులు 'యాంగ్రీ యంగ్‌మేన్ లుక్స్' అనిపించింది గుర్నాధంకి.

క్షణాల తర్వాత అన్నాడు మురళి– "మీరేమీ వర్రీకాకండి. నాకు తెలుసు కదా. చూస్తాను– నేనేం చేయగలనో!"

నీరసంగా, అయోమయంగా మురళి వైపు చూశాడు గుర్నాధం.

కొంత తెలిసీ, కొంత తెలియని భావన కలిగింది. అసలు సగం ఏదో ఊహకి అందలేదు.

నిమ్మళంగా గది బయటికి వచ్చేశాడు.

– మర్నాడు...

ఉదయం ఎనిమిది దాటింది. త్వరత్వరగా తయారై, టిఫిన్ చేసి "నేను చంద్రం వాళ్ళింటికి వెళుతున్నాను. కొన్ని బుక్స్ వాడి దగ్గరున్నై!" అంటూ బయటికి వెళ్లిపోయాడు మురళి.

పది గంటలవుతుండగా మజ్జిగ గ్లాసు అందించి, భర్త ఎదురుగా నిలబడి, ఏదో చెప్పబోయింది శాంత. ఆలోచనల కొమ్మలా వుంది. గాలికి వూగుతోంది.

గమనించాడు గుర్నాధం.

"ఏమిటో చెప్పు..." అన్నాడు చొరవగా.

"వాడు రాత్రంతా నిద్రపోలేదు. చదువుతూ కాదు, ఆలోచిస్తూ!" అని క్షణం ఆగి "వాడి వాలకం చూస్తుంటే నాకెందుకో భయంగా వుందండీ..." అంది.

పల్లవి తుంచి పారేసిన పాటలా ఉన్నాయామె మాటలు. అవ్యక్త భయం మరి! దారులు తప్పించుకుని అటూ ఇటూ పరిగెత్తుతూ ఒక్క ఉదుటున మీదపడిన ఈదరగాలి విసురులా ఆమె చూపులు భర్తని తాకేయి.

క్షణాల తర్వాత ఖాళీ గ్లాసు తీసుకుని వంటింట్లోకి నడిచింది శాంత. గుర్నాధం మౌనంగావుండిపోయాడు.

– మధ్యాహ్నం భోజనానికి రాలేదు మురళి. ఏదో ఇంత తిని అయిందనిపించారు పెద్దవాళ్ళు.

సమయం గడుస్తోంది.

కొంచెంగా మొదలైన ఆందోళన చినుకులు, ఆరాటం వానగా పెరిగి, భయం తుఫానుగా కాలు నిలవనీయటం లేదు భార్యాభర్తల్ని. ఇల్లంతా అలంగం తిరగసాగేరు. ఇద్దరికీ అస్థిమితంగా వుంది.

మురళి కోసం ఎదురుచూడసాగేరు.

ఐదయింది. చంద్రం ఇంటికి ఫోన్ చేస్తే తేలింది –

అసలు చంద్రం ఇంటికే వెళ్లలేదు మురళి. చంద్రమూ ఉదయాన్నే బయల్దేరి బయటికి వెళ్లాడని చెప్పారు. తెలిసిన వాళ్ళందరికీ ఫోన్ చేశారు.

ఏ సమాచారమూ అందలేదు.

ఆరయింది... ఏడయింది.

వార్తల కోసం టీవీ ఆన్ చేశాడు గుర్నాధం. ఏదో ఛానల్ తగిలింది. పరీక్షహాల్‌లో కాపీయింగ్‌కి వ్యతిరేకంగా కాలేజీల ఆందోళన. ఆ రోజు జరిగిన దృశ్యాలు, విద్యార్థులు, పోలీసుల ఘర్షణ!

గుండె బిగపట్టుకుని చూస్తున్నాడు గుర్నాధం. శాంత కూడా పక్కకి వచ్చి నిలబడింది.

ఉలిక్కిపడ్డారు ఇద్దరూ. అదుగో మురళి! వాడి పక్కగా చంద్రం. పోలీస్ వ్యాన్‌లోకి చాలా మందిని ఎక్కిస్తున్నారు. వాళ్ళలో వీళ్ళు, బిగించిన పిడికిళ్ళతో నినాదాలు చేస్తున్నారు.

గుండె దడదడలాడింది గుర్నాధంకి.

శాంత ఏడుపు మొదలెట్టేసింది.

వ్యాన్ కదలబోతుండగా మీడియా వాళ్ళు మురళిని ఏవో ప్రశ్నలడుగుతున్న దృశ్యం.

మురళి చెప్తున్నాడు- "లెక్చరర్లే కాపీల్ని ప్రోత్సహించటం, ఆన్సర్లు చెప్పటం ఈ ఆందోళనకి కారణం", "విద్యార్థి నాయకులు కాని మీరు ఎందుకు ఈ ఘర్షణకు దిగారు?", "ఇది మా అందరి సమస్య, రేపు నాకు ఏ తొంభై అయిదో వచ్చి, కాపీ చేసినవాడికి తొంభై ఏడొస్తే, నా గతి ఏడుపే. మట్టి కొట్టుకుపోతాను. ఈ దారుణం పెరగటానికి వీల్లేదు. దీని అంతు చూస్తాం."

వేరే వార్తల్లోకి వెళ్లింది- యాంకర్.

ఒకపక్కన గుండె విలవిల్లాడింది గుర్నాధానికి. మరోపక్కన ఆశ్చర్యం వేసింది. మురళి ఇంత ఫైర్‌బ్రాండ్ యువకుడా! 'రాముడు మంచిబాలుడు' వంటి సౌమ్యుడిలో ఇంత అగ్నికీల వుందా? ఇంత హఠాత్తుగా ఇంతమందిని ఆకర్షించగలిగాడా?

ఎన్నెన్నో ఆలోచనలు...

శాంతని సముదాయించి బయటికి బయల్దేరాడు గుర్నాధం.

-రాత్రి తొమ్మిదవుతుండగా మురళితో సహా ఇంటికి చేరాడు గుర్నాధం. తెలిసిన అడ్వకేట్ మిత్రుడి సాయంతో పోలీస్ కస్టడీలో వున్న మురళిని తీసుకువచ్చాడు. స్టూడెంట్ అనీ, అందునా మైనర్ అనీ, కొంత చూసీ చూడనట్లు వ్యవహరించారు పోలీసులు.

వీళ్ళిద్దరూ ఇంటికొచ్చేసరికి ఇరుగుపొరుగు అమ్మలక్కలు శాంత చుట్టూ చేరి ఈ విషయాలే ముచ్చట్లాడుతున్నారు. ఇతరుల్లో లొసుగు కనిపిస్తే చాలు- నవ్వేవారికి నవ్వే

వేడుక, దెప్పేవారికి దెప్పవేడుక. వీళ్ళని చూసి, గుసగుసలతో, అపహాస్యపు దృక్కులతో, చులకన హావభావాలతో, నెమ్మదిగా వాళ్ళంతా ఎటువారటు సర్దుకుంటున్నారు.

గుర్నాధంకి తలకొట్టేసినట్లనిపించింది. గుర్నాథంనీ, శాంతని ఆత్మన్యూనతాభావం చుట్టేసింది.

మనవడు ఏదో నేరం చేశాడన్న భావన. అప్పుడే నలుగురూ వేలెత్తి చూపుతున్నారన్న అపరాధ భావన. మురళి తల్లిదండ్రులకీ విషయం తెలిస్తే వారెలా స్పందిస్తారోననే దిగులు. సాఫీగా సాగుతున్న తమ బతుకుల్లో వంకర గీతలు వచ్చేశాయనే భయం, భీతి.

'జెండాలా నిలబడినవాళ్ళం... గాలి దుమారానికి రెపరెపలాడుతున్నట్లయింది పరిస్థితి' అనిపించింది గుర్నాధంకి.

ఈ ఆలోచనల్లోనే ఫోన్ మ్రోగింది.

ఢిల్లీ నుంచి సుందరం. మురళి పరీక్షలెట్లా రాస్తున్నాడని విచారణ!

పొడిపొడిగా సమాధానాలు చెప్పి ఫోన్‌ని మురళికిచ్చాడు గుర్నాథం. అతనూ "అలాగే, ఆc.., ఊc...'లతో ముక్తసరిగా జవాబులిచ్చి ముగించాడు. ఆ తర్వాత ఈ ముగ్గురితోనూ కుసుమ కూడా మాట్లాడింది.

ముగ్గురూ మొహమొహాలు చూసుకుంటూ కూర్చున్నారు.

తడికళ్ళతో మనవణ్ణి చూస్తూ, చేతుల్తో గాల్లో దేవుడికి దణ్ణాలు పెట్టుకుంది శాంత.

ఏదో మొండితనాన్నీ, తెగింపునీ, నిర్ణయాన్నీ మీద కప్పుకుంటున్నవాడిలా బ్లేజర్ కాలర్‌ని పైకి లాక్కుంటూ– తన గదిలోకి వెళ్లిపోయాడు మురళి.

తాతయ్యకీ, అమ్మమ్మకీ, మాత్రం మనసులో గుబులు గుబులుగా వుంది.

– మర్నాడు...

కాలేజీ ముందు విద్యార్థులు భారీయెత్తున ప్రదర్శన నిర్వహించారు. పరీక్షలు బాయ్‌కాట్ చేశారన్నారు. కానీ, ప్రభుత్వాధికారులు మాత్రం పోలీస్‌ల సహాయంతో పరీక్షలు సజావుగా సాగేయన్నారు. స్టూడెంట్స్ పక్షాన నిలిచినవాళ్ళు నిలిచారు, లోనికి వెళ్లిన వారు వెళ్లారు. మురళి నాయకత్వానికి మద్దతు తెలిపినవాళ్ళ సంఖ్య, పరీక్ష రాయని వాళ్ళు పదిహేనిరవై మంది మిగిలారు. దీనికి ముఖ్యమైన కారణం– యూనియన్లు ఈ సమస్యకి మద్దతు నివ్వటానికి అంతగా ముందుకు రాకపోవటమని టీవీ విశ్లేషకుల మాటల్లో బయటపడింది.

మురళికి కోపం, కసి, ఉక్రోషం ఉరకలెత్తాయి. కానీ, ఏం చేయగలడు? పేరు పేరునా లిస్ట్ చూసుకుంటే నిన్న తనతో నిలబడినవారంతా ఆ రోజు పరీక్ష లేనివారేనని తెలిసింది. దీనితో– దెబ్బతిన్న పులిలా గదిలో గాండ్రించుకుంటూ కూచున్నాడు.

ఒక మంచిపని చేద్దామని దిగాడు. పర్యవసానం తనకీ ఏడాది వృధా అయింది. సాధించింది పూజ్యం. వ్యవస్థలో కడకు అందరూ స్వార్థపరులే! ఆశయం మంచిదేనని తాను గాఢంగా నమ్మాడు. అయితే దాన్ని సాధించటానికి వ్యూహం అది కాదా? అంతా అయోమయంగా వుంది మురళికి.

జరిగిన వాస్తవం గుర్నాధంని కలవరపెడుతున్నది. ఆ రాత్రి పొద్దుపోయిన తర్వాత మురళి గదిలోకి వచ్చి మంచంమీద అతని పక్కగా కూచున్నాడు. భుజం తట్టి, అనునయంగా మనవడి కళ్ళల్లోకి చూశాడు.

వర్షాంబుదం కురవనే కురిసింది. వెక్కులతో తాతయ్యను గట్టిగా కౌగిలించు కున్నాడు మురళి!

●

నాలుగోరోజు రాత్రికి ఫ్లైట్‌లో ఢిల్లీ నుంచి వచ్చింది కుసుమ. టీవీ ద్వారా వాళ్ళకీ విషయాలన్నీ తెలిసిపోయినై.

ఎటూ ఈ సంవత్సరం వ్యర్థమైందని మురళిని తీసుకుని ఢిల్లీ వెళ్లిపోయింది.

రెండు నెలలు ఇట్టే గడిచిపోయాయి.

మురళిని ఢిల్లీలోనే కాలేజీలో చేర్పించాలనే నిర్ణయం ఎప్పుడో జరిగిపోయింది.

తండ్రికి ఉత్తరం రాసింది కుసుమ...

"మురళిని భయంకరమైన ఆత్మన్యూనతాభావం అలముకుంది. మానసిక స్థయిర్యాన్ని పూర్తిగా కోల్పోయాడు. తనకు తీవ్రమైన ఓటమీ, అవమానమూ జరిగాయనే భావన వాడిని నిలువునా దహించివేస్తోంది. ఆవేశం వలనా, ఒక స్వాప్నిక ఆశయం వలనా వాడి స్వభావానికి విరుద్ధమైన పని చేశాడు. అందులో ఎదురుదెబ్బ తగిలింది. ఏం చదివినా ఇక వాడు గతంలో మాదిరి బ్రిలియంట్ స్టూడెంట్ కావటం కష్టం. పిటీ! ఇదంతా నా దురదృష్టం. మీ అల్లుడుగారూ మింగలేకా, కక్కలేకా కుములుతున్నారు. మురళికి సైకలాజికల్ కౌన్సెలింగ్ సాగుతోంది. చూడాలి మరి, ఏమవుతుందో..?!"

ఇదీ సారాంశం.

గుర్నాధం, శాంత ఈ పరిస్థితికి చాలా బాధపడ్డారు. 'తమ దగ్గర వుండి మురళి ఇలా అయ్యాడే...' అనే ఆవేదన వాళ్ళిద్దర్నీ ఎక్కువ క్రుంగదీయసాగింది. 'ఎంతో తెలివైనవాడు, ఉజ్వలమైన భవిష్యత్తు ముందున్నవాడు- ఇలా అయ్యాడే...' అనే మనోవ్యధ వారిని అతలాకుతలం చేయసాగింది.

ఆరోజు రాత్రి -

నిద్రపట్టక పక్కమీద అటూ ఇటూ పొర్లుతూ పక్కకి చూశాడు గుర్నాధం. చాపమీద పడుకున్న శాంత కుమిలి కుమిలి ఏడుస్తోంది. సముదాయిస్తూ, విషయమేమిటని అడిగితే ఆమె గొల్లుమన్నది.

సాయంత్రం గుర్నాధం వాక్‌కి వెళ్లినప్పుడు కుసుమ ఫోన్ చేసింది.

"తాతగారింటికి వెళ్లటం లేదనీ, తన కోసం ఎక్కడా వెతకవద్దనీ ఉత్తరం రాసిపెట్టి ఇల్లు వదిలి వెళ్లిపోయాడు మురళి!"

గుర్నాధం గుండెలవిసినై, స్తంభితుడైనాడు. ఎవరిదీ నేరం? వచ్చీరాని వయసులో రోగగ్రస్థ వ్యవస్థలో ఇమడలేక ఉద్రేకంతో చెడిన మురళిదా? దుష్కర కృత్యాన్ని ఎంతో తేలిగ్గా సాగించే ఆ వ్యవస్థలోని అవినీతిపరుడైన వ్యక్తిదా?

గుర్నాధం ఇన్నేళ్ల వయసూ, అనుభవమూ ఆయన ప్రశ్నలకి ఏ జవాబూ ఇవ్వలేకపోయాయి. పచ్చని చెట్లు కూలుతున్న దృశ్యం కళ్ళముందు మెదిలింది. వాటిని కూల్చివేస్తున్న ఆ ముష్కర హస్తాలు ఎవరివి..?

– మురళి ఏమైపోయినట్లు? – ఏళ్లు గడుస్తున్నాయి.

అక్కడ తల్లిదండ్రులూ, ఇక్కడ తాతా, అమ్మమ్మలూ ఎదురుచూపులు చూస్తూనే ఉన్నారు!

ఇవ్వాళ టీవీల్లో గానీ, దినపత్రికల్లోగానీ ఈ వార్తకి జాగా దొరకలేదు. అవి తమ సంచలనాల కడుపులకి వేరే మేత వెతుక్కుంటున్నాయి!

"మరి ప్రభుత్వం?"

కుంటి ప్రశ్నలేయకు, దానికిది చాలా చిన్న సమస్య!!!

●

'సాహిత్య నేత్రం' త్రైమాస పత్రిక ... ఏప్రిల్ – జూన్ 2008 సంచికలో ప్రచురితమైన కథ